# చెల్లనిదేది?

ఎం.జి.స్వామి



ఆడుక్కు తినే వాళ్ళంతా ఓ శాఖ.

ఆ శాఖలో కాస్త పేరూ, పదవీ ఉన్న వాడు వెంకటేశు. వెంకటేశుకి పేరూ, పదవీ కాస్తాకూస్తో డబ్బు కూడేయటం మూలంగా వచ్చింది.

పాపానికి వ్యాపారానికి వున్న సంబంధం ప్రకారం తెల్లవారితే పదివేల అబద్ధాలాడే వాళ్ళంతా ఏ గుడిముందో పదిపైసల దానంతో పాపాన్ని పుణ్యంగా మార్చుకునే ఓ పట్టణాన్ని ఎంచి మరీ తిష్ట

వేసిన వెంకటేశు లాంటి వాళ్ళు 'ఆంధ్రా బిచ్చగాళ్ళ సంఘం' అనే ఓ ప్రతిష్టమైన వ్యవస్థ ద్వారా ఆ పట్టణాన్ని కొన్ని భాగాలుగా చేసి తలా ఒకటి పంచేసుకున్నారు ఎంతో సరదాగా.

అంతే కాకుండా ఆ సంఘానికో బైలా కూడా తయారైంది. ఆ బైలా ప్రకారం ఒకరి బీటులోనికి ఇంకొకరు రాకూడదు. అలా వచ్చిన పక్షంలో సంఘం నుండి వార్ని వెలి వేయడమే కాకుండా, జరిమానా కూడా కట్టించుకునే కట్టుదిట్టాలన్నీ అమలు జరిపించే అధ్యక్షపదవికి జీతంలేని ఉద్యోగిగా ఉంటూ వచ్చాడు వెంకటేశు.

వెంకటేశు అధ్యక్షుడు కాబట్టి, కాస్త రాబడి వచ్చే మెయిన్ రోడ్డును తన బీటుగా తనకు తానే నిర్ణయించుకొని, మిగిలిన వారికి కించిత్ అన్యాయం చేసిన మాట నిజం.

వెంకటేశుది తరుగుతున్న వయసు. దానికితోడు పక్షవాతం! కాలూ-చెయ్యీ పడిపోయి పదేళ్ళయింది. ఒక విధంగా ఈ పక్షవాతం అడుక్కోవడంలో అద్వితీయంగా సాయపడినా - తను వయసులో వున్నపుడు ప్రజల్ని రకరకాల దొంగ వేషాలతో దోపిడీ చేసి పాపాన్ని పెంచుకున్న ఫలితమే ఈ పక్షవాతమనే అనుమానం- అతడి వయసును మరింత పెంచింది, అతని ఆశను మరింత తృంచింది. తను ఒక్కడే రోగిష్టి కాదు, తన పెళ్ళాం కూడా! నిజమే-ఎందుకు కాదు? తను చేసిన పాపంలో వంతు దానికీ చెందుతుంది కదా! వెంకటేశులో అనుమానం మరింత దృఢ పడడానికిదో ఆధారం.

వీటి నన్నిటినీ పరిష్కరించాలంటే ఏదైనా చెయ్యాలి. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలన్నా డబ్బు కావాలే! అందుకే వెంకటేశు బోలెడు పాపాలు చేశాడు. గుడి ముందు గుడ్డివాడిలా, మెయిన్ రోడ్డులో మూర్ఛరోగిలా, వీధుల్లో కుంటివానిలా, సంతల్లో కుష్ఠి రోగిలా రకరకాల వేషాలు ధరించి, నోరు కట్టుకొని డబ్బు దాచాడు—కాదు దోచాడు. అలా చిల్లరమల్లరంతా ప్రోగేశాడు.

అడుక్కోవడం అనేది దోసు ఎక్కువైతే దోపిడీగా మారుతుందని, పాపం అంటే అదేనని వెంకటేశు నమ్మకం. అలా అనిపించిన తరువాత తన పాపభారాన్ని కొంతవరకైనా తగ్గించుకుందామని ఓ సంఘం పెట్టి,


(మిగతా కథ 76 వ పేజీలో)

(చెల్లనిదేది? ........... 17 వ పేజీ తరువాయి)

మెయిన్ రోడ్డు ఒక్కటే తానుంచుకొని మిగతావి, మిగతా సభ్యులకు దానం చేసేశాడు.

వెంకటేశు అడుక్కున్నోడు కావచ్చు, కాని త్రాగుబోతు మాత్రం కాదు. అందుకే కొంత డబ్బు వెనకేసుకో గలిగాడు. అది పాపయ్య అనే ఓ కుర్ర ముష్టివాడికిష్టం లేదు.

వెంకటేశు వెనకేసిన డబ్బును దోచుకోవాలని వెంకటేశు లేని సమయంలో పాకలో జొరబడ్డాడు పాపయ్య.

పాపయ్య పోలీసువాళ్ళ దృష్టిలోను, దొంగల లిస్టులోను ఇంకా చేరలేదు. ఏ పనీ చాతకాని సోమరిపోతైతే మాత్రం, ఆకలిలేనిమనిషి కాదు! అందుకే దాచుకున్నది దోచుకునేందుకు వచ్చాడు. కాని పాపయ్య పథకం పారలేదు. వెంకటేశు అంతలో ఎక్కడినుండో వచ్చేశాడు. సినిమాల్లో హీరో-విలన్లలావాళ్ళు కొట్టుకోలేదు. కారణం-వెంకటేశుకి పక్షవాతం, పాపయ్యకు పాప భయం.

అందుకే పాతికేళ్ళనుండి దాచుకుంటూ వచ్చిన చిల్లర-మల్లరమే, రూపాయినోట్లను మూటకట్టి బ్యాంకుకి బయలుదేరాడు వెంకటేశు.

డబ్బున్న వాళ్ళ కోసమే పెట్టిన బ్యాంకులోకి, డబ్బున్నవాడు-డబ్బులేనివాడు అయిన వెంకటేశు, అతని రూపం-లోనకు వెళ్ళడానికి డిస్క్వాలిఫై చేశాయి. గుమ్మంలోకి ఇంకా అడుగు పెట్టలేదు. హనుమంతుడిలా ఎగిరి వచ్చిన అటెండరు- "పోరా! లోనకు రాకూడదు" అంటూ మెడ మీద కర్రలాంటి చెయ్యి పెట్టి గెంటేశాడు.

"బావుఁ- నేనడుక్కోడానికి రానేదు!" ప్రాధేయ పూర్వకమైన వినతి వెంకటేశు కంఠం నిండా ఒలికింది. కాని అటెండరు ముప్పైరెండు పళ్లు బైటపడ్డాయి. నోరు ఊరంత సాగింది. "మరి దోపిడీకి వచ్చావా?" అన్నాడు వ్యంగ్యంగా.

ఆ క్షణంలో వెంకటేశు మనసు ఎవరికీ తెలియకుండా బాధ పడింది. మరుక్షణంలో నవ్వుకుంది. కాని పైకి నవ్వే ధైర్యాన్ని, ఎదురు చెప్పే నైజాన్ని వెంకటేశు ఏనాడో చంపుకుని ఈ వృత్తిలో దిగాడు. అందుకే స్థాయిగా-"పెదోళ్ళంతా దోపిడీగాల్లు-దొంగ నాయాల్లు కాదు బావుఁ" అన్నాడు.

గవర్నమెంటిచ్చిన అటెండరు యూనీఫారం, బిచ్చగాడి ఎదిరింపును విని సహించలేక పోయింది.

"దొంగవో- దొరవో! ముందవతలకి నడు" అంటూ ఓ అడుగు ముందుకు వేశాడు అటెండరు.

ఎప్పటి నుంచో ఇదంతా గమనిస్తున్న ధర్మరాజనే ఓ పెద్దమనిషి అటెండరుకు చెప్పి, వెంకటేశుకి లోనకువెళ్ళే పర్మిషన్ కల్పించాడు. తన నట్లా కటాక్షించిన ధర్మరాజును ఆ దేవుడే పంపినట్లు భావించి, ధర్మరాజుకో దండం పెడుతూ, "దరమరాజులాంటోరు- ఎయ్యేళ్ళు బతకండి బావు!" అని ఓ దీవెన ఫ్రీగా పారేశాడు వెంకటేశు.

"నా పేరు నీ కెలా తెలుసు? అదిసరే-డబ్బు ఎంతుందో . లెక్క- పెట్టావా?" అని అడిగాడు ధర్మరాజు.

"లెక్కెడ్డానికి సదువుకుంతేకద బావు! మీరే సూడండి" అంటూ సంచిని చంక దించి ధర్మరాజు ముందుంచాడు వెంకటేశు.

ధర్మరాజు నోట్లు, చిల్లర లెక్క- పెడుతున్నంతసేపు వెంకటేశు మెదడులో అతడి భార్య- భార్య కున్న టి. బి.; తను- తన కున్న పక్షవాతం; గతం- గతాని కున్న పాపం మెదులు తున్నాయి.

లెక్కించడం అయ్యాక, "చాలా డబ్బు దాచావే! మొత్తం పందరూపాయిలున్నాయి. ఏకంగా పెద్దనోటు తీసుకో. భద్రంగా దాచు

---

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్.

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మీకాలనీ, మద్రాసు-600 026.

కొని అవసరాలకు వాడుకోవచ్చు" అని ఓ ఉచిత సలహా యిచ్చాడు ధర్మరాజు.

'అదేమిటి! అంత డబ్బుంటే వందరూపాయిలే ఉందని అంటా దేమిటి ధర్మరాజూ?' అనే సందేహం నిజానికి వెంకటేశుకి రావాలి కాని, అదంతా గమనిస్తున్న అటెండరుకి వచ్చింది. ఇలాంటి దృశ్యాలు కంటబడితేనేకదా- ఎవరికైనా జేబులు నిండేది. అందుకే పనులున్నా వదులుకొని ప్రక్క-నుండి గమనిస్తున్నాడు అటెండరు.

చిల్లర, నోట్లు ఇచ్చేస్తే,కొన్ని వంద నోట్లు వచ్చాయి. ఎవరూ చూడకుండా, ఒక టుంచి మిగతావి జేబులో వేసుకున్నాడు ధర్మరాజు. కాని ఆఖర్న తన కన్నీ తెలుసునని ధర్మరాజును ఓ చిన్న సైజు దోపిడీ చేశాడు అటెండరు.

పెద్దనోటు అంటే ఎలా వుంటుందో అప్పుడే చూసి తెలుసుకున్న వెంకటేశు - అనుకున్నది సాధించిన ఆర్మ్‌స్ట్రాంగ్ కన్నా అమితానందంతో పక్షవాతాన్నే మర్చిపోయి పెద్ద పెద్ద అంగల్లో గుడిసె చేరాడు.

ధర్మరాజు ధనికుడే అయినా దగా అతని ఊపిరి! దోపిడీ అతని వ్యాపారం! కాని వెంకటేశు దృష్టిలో మాత్రం ఇప్పుడతడు 'జనమలో మరిసిపోలేని దరమపెబువు!'

మామ ఎంతో సంబరంతో సూపించిన వంద కాగితం చూసి, 'అదేటి మావా! అంత మూట పట్టు కెల్లి, సులాగ్గా ఇదొట్టుకొచ్చావు?' అని సత్తెమ్మ అనుమానంతో అడగలేదు. 'అంతా 'వెంకటేశు ఉన్నోడు-ఉన్నోడు' అంటుంటారే! ఇదేనా తమకున్నది? ఈ మాత్రం దానికే ఆళ్ళంతా ఎందుకలా ఇదౌతార'ని బాధబడింది. సత్తెమ్మ ముందు వెంకటేశు తెలివైనవాడే! అందుకే, "ఓసెర్రి మొగమా! ఇది సెత్త కాగితం ముక్కనాగున్నాదని సీర్సంగ చూడక! వొందరూపాయిల నోటే! పిర్లంతా ఇచ్చేసి దీన్నొట్టుకురాడానికి బేంకాడ కెల్లినానా....సమయానికా దరమరాజు నేపోతే, 'ముట్టోడివి, ఇంత డబ్బు నీకేడది? దొంగలాడినావా?' అని పోలీసుల సేత బొక్కల దోయించీదురు! అదురుట్టం తిన్నగున్నాది కాబట్టి నీ కాడిలా నిలబడ్డాను" అంటూ నోటును దగ్గరగా మడిచి గుడ్డ పేలికతో కట్టి గోచీలో భద్రంగా దాస్తూ-"ఇంకెవులే- దొంగలాడగలరు? ఇది డబ్బు కాదే- సీమ్మ,

రక్తం! ఎన్నాలనుండో మన జబ్బును నయం సేసుకుందామనుకుంతన్నామా! ఆయేల దగ్గిర కొచ్చినాదే" అంటూ కంట నిండిన తడిని తుడుచుకున్నాడు వెంకటేశు.

వందనోటుతో వొంట్లో జ్వరమే వదలదు. అలాంటి నోటుకి పక్షవాతం, టి. బి. లు వదులుతాయా? వెంకటేశు పిచ్చిగాని!

అలా తన ఆస్తినంతా పెద్ద నోటుగా మార్చుకొని గోచీలో దాచుకున్నాడన్న సంగతి పసిగట్టిన పాపయ్య మరో ఎత్తు వేశాడు. తనకు లాభం లేకపోయినా ఎలాగైనా వెంకటేశు చమ్కీ తినాలని పెద్ద నోటు చెల్లదనే వార్తను మోసుకొచ్చి, వెంకటేశు చెవిలో వూదాడు పాపయ్య.

"ఒరేయ్ పిసినారి నాయాలా! నీకంతే కావాల! నువ్వుతిన్నావు గాదు, నన్ను తిన్నిచ్చావుగాదు! ఆ కాగితం ముక్క నీ నెత్తి మీదెట్టుకొని ఊరేగు" అంటూ తన కసినంతా మాటల్లో కక్కేసి వెళ్లిపోయాడు పాపయ్య.

"ఇదేటి మావా! ఇలాగైపోనాది? ఆకరికి మన కట్టమంతా బూడిద పాలైపోనాది" అంది సత్తెమ్మ దిగులుగా.

నిజంగానే కాలూ- చెయ్యీ ఆడని వెంకటేశుకు ధర్మరాజు జ్ఞాపకం వచ్చాడు. అతని కోసమే ఊరంతా వెతికాడు.

ధర్మరాజు కూడా పాపం వెంకటేశు కోసం ఊరంతా గాలించాడు. కాని, ఎవరికెవరూ కలవకపోవడమే అక్కడ జరిగిన థ్రిల్!

'రేపెలాగైనా ఈ నోటు మారిస్సి నా సిల్లర నాను తెచ్చుకోవాల' అని వెంకటేశు, 'వెంకటేశు నోటు సంగతి ఎలాగైనా తేల్చేయాల'ని ధర్మరాజు అనుకున్నారు. ఇద్దరూ ఎప్పుడు తెల్లవారుతుందా అని కాచుక్కూచున్నారు.

మరునాడు బ్యాంకు గేటుముందు ఇద్దరూ కలుసుకున్నారు. విష్ణుమూర్తే ప్రత్యక్షమైనట్టు వెంకటేశుకి, లక్ష్మీదేవే ప్రత్యక్షమైనట్టు ధర్మరాజుకి అన్పించింది.

దిగులు, భయం, ఏడుపు-ఈ మూడూ మిళితంచేసి తన అవస్థ చెప్పబోయేందుకు వెంకటేశు ఉపక్రమించే లోపు ధర్మరాజే అందుకొని- "నాకు తెల్సు, నీకు చిల్లర కావాలి. అంతేగా?" అన్నాడు వరమిచ్చేందుకు కమండలంలో నీరు చేతిలో పోసుకుని రడీగావున్న

మహత్తుగల ఋషి పోజులో.

'దరమరాజు ఎంత మంచోడు!' అని మరో మారు వెంకటేశు అనుకున్నాడు. అంతే కాదు- చచ్చి ధర్మరాజు కడుపులో తప్పకుండా పుట్టాలనికూడా అనుకున్నాడు.

ఆ రోజు బ్యాంకు, కొత్త పిక్చర్ రిలీజైన సిన్మాహాల్లా-రద్దీగా ఉంది.

"ఈ జనంలో నీ నోటు ఎవరైనా కొట్టేగల్రు! ఆ తరువాత క్కిర్రో మొర్రో మంటావు. పేదోడివి- కష్టపడి సంపాదించావు. ఇలాతే" అని వెంకటేశు చేతినుండి నోటు లాక్కొని ఓసారి అటూ యిటూ దాన్ని త్రిప్పి చూశాడు ధర్మరాజు.

"ఏటిబాపు! అలా సూత్తన్నారు? మీరేగంద మారిసినారు?"

"అవును. ఎవరు కాదన్నారు? ఎలా మారదో చూస్తా" అంటూ వెంకటేశుని హాల్లో వున్న ఓ బెంచీపై కూర్చోపెట్టి లోనకెల్లాడు ధర్మరాజు.

'నా డబ్బు మారేటట్టు సెయ్యి దేవుడా!' అని మొక్కుబడులు ప్రారంభించాడు వెంకటేశు.

కౌంటర్ దగ్గర నిలుచున్న ధర్మరాజును చూసేసరికి లడ్డూలు దొరకబోతున్నంత ఉత్సాహంగా అతడ్ని అనుసరించాడు అపెండరు.

తిరిగి వస్తున్న ధర్మరాజును ఆశగా చూశాడు వేంకటేశు.

ధర్మరాజు చాటంత ముఖం గోరంత చేసుకొని, "మొన్న మనం మార్చిన ఈ నోటు చెల్లదట! మీరే ఇచ్చిందన్నాను. 'కాదు, ఇది దొంగ నోటు. మీకెలా వచ్చింది? ఎవ రిచ్చారు?' అంటూ ఆచూకీ తీయబోయే సరికి నా పై ప్రాణాలు పైనే పోయాయి. ఏదో తెలిసిన వాడు కాబట్టి, నువ్వు-నేను బ్రతికి పోయాం. లేకపోతే ఈ పాటికి బొక్కలో తోయించేద్దురు. 'ఏదో పేదవాడివి, ఏమీ తెలియని అమాయకుడివి' అని జాలిపడ్డాను. నీకన్యాయం చేసినోడు పురుగుపట్టి చస్తాడు. మరి నే వస్తాను" అంటూ ఆ నోటును వెంకటేశు చేతిలో పెట్టి అతని పరిస్థితితో సంబంధం లేకుండా ఎటో వెళ్ళిపోయాడు ధ....ర్మ....రా....జు!

అయితే....చెల్లనిదేది?

చేతులు మారిన ఆ నోటా?! లేక, చేతగాని వెంకటేశు బ్రతుకా?!

*

Edited & Published by VIJAYA BAPINEEDU
80, Dhanalaxmi Colony, Madras- 600 026 and,
Printed by him at Vijaya Graphics;
210-Arcot Road, Madras-600 026. Phone: 422233